క్లుప్తంగా

సత్యనారాయణ స్వామికి మంత్రి వనిత పూజలు



నెలటూరులో మంత్రి వనితను సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు

చాగల్లు: నెలటూరులోని సీతారామ రమా సత్యనారాయణ స్వామి ఆలయాన్ని రాష్ట్ర హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత శుక్రవారం దర్శించారు. ఆలయ చైర్మన్ తాళ్లూరి మాధవ్ వెంకటకృష్ణ ఆధ్వర్యంలో మంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద నిర్వహించిన కార్తిక వన సమారాధనలో మంత్రి పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించారు. ఆలయ కమిటీ మంత్రిని సత్కరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, పార్టీ నాయకుడు జుట్టా కొండలరావు, ఎంపీటీసీ తాళ్లూరి రమ్య పాల్గొన్నారు. కాగా మండలంలోని వైష్ణాలయాల వద్ద కార్తిక ఏకాహం ముగింపు సందర్భంగా నేలటూరు గ్రామంలోని కోడూరి వారి రామాలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. అలాగే చాగల్లు వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోను అన్నదానం చేశారు.

నేటి నుంచి ఆరికిరేవులలో గడప గడపకూ..

కొవ్వూరు: మండలంలోని ఆరికిరేవుల పంచాయతీ పరిధిలో హోం మంత్రి తానేటి వనిత ఈనెల 25, 26, 27 తేదీల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారని ఎంపీడీవో కె.సుశీల శుక్రవారం తెలిపారు. కార్యక్రమం మధ్యాహ్నం మూడు గంటల నుంచి ప్రారంభం అవుతుందని, అన్ని శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

యానిమల్ హెల్త్ కార్డుల పంపిణీ

పెరవలి: మండలంలోని అజ్జరం గ్రామానికి మంజూరైన 22 పాడి పశువులకు హెల్త్ కార్డులు మంజూరయ్యాయి. సర్పంచ్ గార్లపాటి నాగసుధా భూషణం శుక్రవారం వాటిని పాడి రైతులకు అందించారు. పశు వైద్యాధికారి వానపల్లి చరణ్ ఫణీంద్ర, వెంకట్రాయపురం సర్పంచ్ పోలిశెట్టి బాలాజీ, నల్లిమిల్లి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్-14 ఫుట్‌బాల్ రాష్ట్ర జట్టులో వెంకటేష్



జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన పిక్కి వెంకటేష్‌తో హెచ్‌ఎం పద్మశ్రీ, పీడీ భాస్కర్

కొవ్వూరు: స్కూల్ గేమ్స్, అండర్-14 ఫుట్ బాల్ రాష్ట్ర జట్టుకు కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి పిక్కి వెంకటేష్ ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు ఆర్. పద్మశ్రీ శుక్రవారం తెలిపారు. ఈనెల 21 నుంచి 23 వరకు విశాఖపట్నం జిల్లా భీమునిపట్నంలో నిర్వహించిన ఫుట్‌బాల్ రాష్ట్ర జట్టు ఎంపిక పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా తరఫున పాల్గొన్న వెంకటేష్ విశేష ప్రతిభ కనబరిచినట్టు ఆమె చెప్పారు. ఈ క్రమంలో రాష్ట్ర జట్టుకు ఎంపికైన వెంకటేష్ జార్ఖండ్ రాజధాని రాంచీలో త్వరలో నిర్వహించే జాతీయ స్థాయి అండర్ -14 ఫుట్‌బాల్ పోటీల్లో ఆడతాడన్నారు. వెంకటేష్‌ను, అతడికి శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు ఎస్.భాస్కర్‌ను హెచ్‌ఎం అభినందించారు.

మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం

నల్లజర్ల: మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం శుక్రవారం వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ఏపీఎం కె.విజయనిర్మల కుమారి అధ్యక్షతన జరిగింది. మండల సమాఖ్య పనితీరు మెరుగు పరచాలని, నూతన కార్యవర్గానికి ఎన్నికైన సభ్యులు వైఎస్సార్ మహిళా మార్ట్ అభివృద్ధికి కృషి చేయాలని, మార్ట్‌లో అమ్మకాలను పెంచాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మండల కమిటీ ఏడాది పాటు అధికారంలో ఉంటుందన్నారు. నూతన అధ్యక్షురాలిగా జి.ప్రసన్నకుమారి, ఉపాధ్యక్షురాలిగా నెక్క లపూడి విజయలక్ష్మి, కార్యదర్శిగా వై.శేషారత్నం, కోశాధికారిగా జి.సత్యవతి ఎన్నికయ్యారు. వీరందరితో ఏపీఎం ప్రమాణ స్వీకారం చేయించారు.

భారీ అన్నసమారాధన

నల్లజర్ల: కార్తిక మాసం సందర్భంగా పోతవరం గ్రామంలోని ఉమా రామలింగేశ్వర స్వామి వారి ఆలయ ఆవరణలో శుక్రవారం సుమారు ఐదు వేల మంది భక్తులకు అన్నసమారాధన చేశారు. ఆలయ అర్చకుడు మనోహర్ ఆధ్వర్యంలో ధర్మకర్త దివంగత పాపా సూర్యప్రకాశరావు భార్య గంగారత్నం, వారి కుమారుడు శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు తొలుత విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్, మోత్కూరి శ్రీనివాస్, ఆరేటి బోస్, విస్సాకోడేటి సుబ్బారావు, గద్దే నరసింహమూర్తి, ఆరేటి శివ, నాయుడు కొండలరావు పాల్గొన్నారు.

బోరుమంటున్న నారుమడిదారులు

- పొగాకు నారుకు తగ్గిన డిమాండ్
- రైతులకు భారీ నష్టాలు
- ఎకరానికి సరిపడా నారు రూ.2 వేలు
- పెట్టుబడులు కూడా రాని పరిస్థితి
- ఎకరాకు రూ.2 లక్షల వరకూ నష్టం



దేవరపల్లి మండలం పల్లంట్లలో పొగాకు నారుమడులు

దేవరపల్లి: పొగాకు నారుకు ఈ ఏడాది డిమాండ్ తగ్గిపోయింది. దాంతో నారుమళ్లు కట్టిన రైతులకు నష్టాలు వచ్చాయి. గతేడాది మార్కెట్‌లో పొగాకుకు మంచి గిరాకీ ఏర్పడింది. ఈ ఏడాది నారుకు కూడా రేటు ఉంటుందని రైతులు ఆశపడి అధిక కౌలుకు భూములను తీసుకుని నారుమడులు కట్టారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతంలో అక్టోబరు నెలాఖర్లో పొగాకు నాట్లు ప్రారంభించారు. నెల రోజులుగా వేస్తున్న నాట్లు చివరి దశకు చేరుకున్నాయి. వాతావరణం అనుకూలించడంతో నాట్లు సకాలంలో పూర్తిచేశారు. పొగాకు సాగు చేసే రైతులతో పాటు నారు వ్యాపారులు అధిక విస్తీర్ణంలో నారుమడులు కట్టారు. దీంతో నారుకు డిమాండ్ తగ్గింది. నాట్ల ప్రారంభంలో ఎకరం విస్తీర్ణానికి సరిపడిన(6 వేల మొక్కలు) నారుకు రూ.2500 నుంచి రూ. 3000 రేటు పలికింది. ఈ ధర కొద్దిరోజులు మాత్రమే ఉంది. అనంతరం రూ.2 వేలకు తగ్గింది. ధర తగ్గినా వచ్చినకాడికే సరిపెట్టుకుందామని నారుమళ్ల రైతులు భావించారు. అయితే నారు కొనే నాథుడే లేడని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలాఖరుకు దాదాపు నాట్లు పూర్తవుతాయని రైతులు తెలిపారు. మళ్లల్లో ఎక్కడ నారు అక్కడే ఉందని, నారు కావాలని వచ్చే రైతులు కనబడడం లేదని నారుమళ్ల రైతులు తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఐదు వేలం కేంద్రాల పరిధిలో సుమారు 1200 ఎకరాల్లో పొగాకు నారుమడులు కట్టారు. ప్రస్తుత సీజన్‌లో నారు ధర ఎకరానికి రూ.2 వేల నుంచి రూ. 3 వేలు పలుకుతోంది. 2021 సీజన్‌లో ఎకరం నారు రూ.18 వేలు పలికింది. అప్పుడు నారుమడులు కట్టిన రైతులు ఎకరాకు రూ.15 లక్షల నుంచి రూ. 20లక్షల వరకూ సంపాదించారు. గతేడాది ఎకరం నారు రూ.3000 నుంచి రూ. 3,500 పలకడంతో చాలామంది నారుమళ్ల రైతులు పెట్టుబడులతో గట్టెక్కారు. ఈ ఏడాది మాత్రం పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదని వారు గగ్గోలు పెడుతున్నారు. నారుమళ్ల రైతులలో 90 శాతం మంది కౌలుదారులే.

ఎకరం భూమి కౌలు రూ.60 వేలు

ఎకరం భూమి కౌలు రూ.60 వేలు పలికింది. అయినా రైతులు వెనుకాడకుండా ధైర్యంగా కౌలుకు తీసుకుని నారుమడులు కట్టారు. కనీసం పెట్టుబడులు, కౌలు డబ్బులైనా రాకపోతాయా? అని రైతులు ఆశతో నారుమడులు కట్టారు. కిలో విత్తనాలు రూ.20 వేలకు కొనుగోలు చేశారు. కౌలు కాక పెట్టుబడి ఎకరానికి సుమారు రూ.2 లక్షలు అయినట్టు తెలిపారు. చాల మంది రైతులకు పెట్టుబడులు రాక నష్టపోయామని వాపోతున్నారు. కొంత మంది రైతుల మళ్లల్లో మొక్క కూడా బోణీ కాలేదని రైతులు తెలిపారు.

నూతన వంగడాలకు డిమాండ్

నూతన వంగడాల పొగాకు నారుకు కొంత వరకూ డిమాండ్ ఉంది. ఎ-3, 53 వంగడాలకు గిరాకీ ఉందని రైతులు తెలిపారు. ఎకరానికి సరిపడా ఈ వంగడాల నారు నారు రూ.3,500 ధర పలుకుతోంది. మొన్నటి వరకూ ఎక్కువగా సాగు చేసిన ఎల్‌వీ-7 వంగడం నారుకు రైతులు మొగ్గు చూపడం లేదని నారుమళ్ల రైతులు తెలిపారు. కొత్త వంగడం నారు తక్కువ విస్తీర్ణంలో ఉన్నందున డిమాండ్ ఏర్పడిందని చెప్పారు.

పెట్టుబడులు రావడం కూడా అనుమానమే



నారుకు రేటు లేదు. పెట్టుబడులు రావడం కష్టంగా ఉంది. నేను అరెకరం విస్తీర్ణంలో నాగుమడులు కట్టాను. కౌలు రూ.30 వేలు, పెట్టుబడి రూ.1.50 లక్షలు అయింది. నూతన వంగడాలు ఎ-3, 53 నారు కట్టడం వల్ల పెట్టుబడులతో బయటపడ్డాను. రెండేళ్లుగా నారు రేటు ఆశాజనకంగా లేదు. పొగాకు సాగు విస్తీర్ణానికి మించి నారుమడులు ఉండడం వల్ల డిమాండ్ తగ్గింది. చాల మంది రైతులకు పెట్టుబడులు కూడా రాలేదు. నారు వ్యాపారం గాలివాటం.

– బండారు తిరుమలరావు, కౌలు రైతు, దేవరపల్లి

కోలుకోవడం కష్టం



నారుమళ్లు కట్టిన రైతులు కోలుకోవడం కష్టం. ఎకరాకు రూ.2 లక్షల నష్టం వస్తుంది. గత రెండేళ్లుగా నారుమడులు కట్టి నష్టపోతున్నాను. నూతన వంగడాల నారును ఎక్కువగా అడుగుతున్నారు. ఎకరం విస్తీర్ణంలో నారుమడులు కట్టాను. ఎకరం కౌలు రూ.60 వేలు, పెట్టుబడి రూ.2 లక్షలు అయింది. ఎల్‌వీ-7 నారు మడుల్లోనే ఉండి పోయింది. నూతన వంగడాల నారు పోయలేదు. ఈ ఏడాది నారుమడుల రైతులు నిండా మునిగారు.

– కడిమి శ్రీనివాస్, కౌలు రైతు, దేవరపల్లి

అన్ని వర్గాల సంక్షేమం జగన్ ధ్యేయం

- హోం మంత్రి తానేటి వనిత
- చాగల్లు ఇందిరమ్మ కాలనీలో వనిత,
- సమిశ్రగూడెంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు గడప గడపకూ..



చాగల్లులో సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న మంత్రి తానేటి వనిత



సమిశ్రగూడెంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

చాగల్లు: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. శుక్రవారం ఆమె 165వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చాగల్లు పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా చాగల్లు సచివాలయం- 4 పరిధిలో ఆమె ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను కుటుంబ సభ్యులకు వివరించారు. వారు పొందిన లబ్ధి వివరాలతో కూడిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంతకం చేసిన కరపత్రాలను అందజేశారు. కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను మంత్రి పరిశీలించారు. అక్కడి చిన్నారులు, విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ప్రభుత్వం అందిస్తున్న జగనన్న గోరుముద్ద పథకం అమలుపై వారిని వనిత ఆరా తీశారు. ఈ సందర్భంగా హోం మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానన్ని సంక్షేమ పథకాలు ఆంధ్రప్రదేశ్‌లోని జగనన్న ప్రభుత్వంలో మాత్రమే అమలవుతున్నాయన్నారు. రాష్ట్రంలో అనేక విద్యా సంస్కరణలకు శ్రీకారం చుడుతూ, విద్యార్థులను గ్లోబల్ సిటిజన్లుగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

ఒకవేళ అర్హత ఉండి కూడా ఏ సంక్షేమ పథకమైనా అందని వారు, ఆ విషయాన్ని తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గండ్రోతు సురేంద్రకుమార్, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, పార్టీ మండల శాఖ గౌరవాధ్యక్ష,అధ్యక్షులు జట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఉప సర్పంచ్ మేకా రాజు, వర్ధినేడి చిన బాబు, ఇంటి వీర్రాజు, బొర్రా రజనీప్రసాద్ అధికారులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

జగనన్న పాలన దేశానికే ఆదర్శం

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశంలోని ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని సమిశ్రగూడెం సచివాలయం-2 పరిధిలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్నప్రియాంక, వైఎస్సార్ సీపీ గ్రామ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తూ బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగన్ పాలనకు, మోసపూరిత వాగ్దానాలిచ్చే చంద్రబాబు పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని గమనించాలని ప్రజలకు కోరారు. గతంలో టీడీపీ సానుభూతిపరులకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని, ప్రస్తుతం జగనన్న పాలనలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను అందిస్తున్నారని వివరించారు. సమిశ్రగూడెం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని, త్వరలోనే పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు, డ్రైయిన్లు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. సమిశ్రగూడెం- నిడదవోలు ఆర్వోబీతో పాటు సమిశ్రగూడెం గడ్డర్ వంతెన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు అంగర ఝాన్సీరాణి, ఉప సర్పంచ్ గజ్జరపు నవరజిని, వైఎస్సార్ సీపీ నాయకులు కస్తూరి సాగర్, అంగర శ్రీను, దేశాబత్తుల నాగు, వడల అంబేడ్కర్, గెడ్డం రవీంద్రబాబు, పుచ్చకాయల విజయ్ పాల్గొన్నారు.

జగనన్నతోనే ప్రగతి సాధ్యం

- వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు
- ప్రతి సచివాలయం పరిధిలో ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్
- సమాచార బోర్డుల ఆవిష్కరణ, పార్టీ పతాకాల ఎగురవేత



నిడదవోలు-4 సచివాలయం వద్ద డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరించిన మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర ప్రగతి, పేదల సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా సాగింది. మండలంలోని కోరుపల్లి వాసులకు అందించిన రూ.15.85 కోట్ల సంక్షేమ పథకాలు, రూ.8.35 కోట్లతో ఈ గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన సమాచార బోర్డులను పల్లారావు, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ వెలగన పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు ఈరి గంగారావు ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ జెండాను నాయకులు ఎగుర వేసి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తర్వాత సహపంక్తి భోజనం చేసి పల్లె నిద్ర చేశారు. కార్యక్రమాల్లో సొసైటీ అధ్యక్షుడు ఆత్రేయపురపు రాజారావు, యళ్ల రామారావు, పార్టీ నాయకులు మన్యం సూరిబాబు, మానుకొండ చంద్రబాబు, మట్టా వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఎం.వెంకటేష్ పాల్గొన్నారు.

నిడదవోలు పట్టణంలో..

నిడదవోలు: పట్టణంలోని ఒకటో వార్డు, సచివాలయం-4 వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ గత నాలుగున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు బుక్‌లెట్ అందించి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముంగంటి కృపానందం, పార్టీ జిల్లా కార్యదర్శి మద్దిపాటి ఫణీంద్ర, కౌన్సిలర్లు గోపిరెడ్డి శ్రీనివాస్, ఆకుల ముకుందరావు, షేక్ వజీరుద్దీన్, కొత్తపల్లి సుప్రియ, మద్దిపాటి నాగశ్రీ, ఎండీ షకీరాబేగం, మానుపాటి లక్ష్మి, ఆలమూరి భారతి పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని ఖండవల్లి-2 సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ ప్రసంగిస్తూ ఈ సచివాలయ పరిధిలోని ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం గత నాలుగున్నరేళ్లలో జగన్ ప్రభుత్వం రూ.24.85 కోట్లు ఖర్చు చేసిందన్నారు. సచివాలయం వద్ద అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన సమాచార బోర్డును ఎంపీపీ ఆవిష్కరించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, జేసీఎస్ మండల రామగుడుల సూర్యనారాయణ, పార్టీ ఎస్సీసెల్ జిల్లా, మండల శాఖల అధ్యక్షులు పాట్టి రాంబాబు, బీరా రాజు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కందా వెంకన్న పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలో వేలివెన్ను గ్రామ సచివాలయం-2 వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరామయ్య ఈ సచివాలయం పరిధిలో జరిగిన సంక్షేమ, అభివృద్ధి పనుల వివరాలతో కూడిన బోర్డులను ఆవిష్కరించి, వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఎగుర వేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మల్లిపూడి పాప, శిరిగిన శివరాధాకృష్ణ, బూరుగుపల్లి పద్మావతి, పణీతన పార్వతి, దుద్దుకూడి గంగారత్నం, పాలంగి, కాల్దారి సొసైటీల అధ్యక్షులు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, అబ్బిన రాంబాబు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని దుద్దుకూరు-2 సచివాలయం వద్ద ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బొంతా నాగమణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పనుల డిస్ ప్లే బోర్డును దుర్గారావు ఆవిష్కరించగా, పార్టీ పతాకాన్ని పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్ ఎగుర వేశారు. సొసైటీ అధ్యక్షులు కాండ్రు రామకృష్ణ ఇంటి వద్ద పల్లె నిద్ర చేశారు. ఎంపీటీసీ సభ్యులు జ్యేష్ఠ సునీత, వి.చంద్ర, మండల వ్యవసాయాధికారి కె. విజయ్, పంచాయతీ కార్యదర్శి బి.రామచంద్రం, ఎంపీటీసీ సభ్యుడు కరుటూరి నిత్యానందం, పార్టీ నాయకులు కె. బుజ్జిబాబు, దోనెల్లి జానకీరాం, గృహ సారధులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

భావి తరాల భవిష్యత్తుకు రాష్ట్రానికి జగనే కావాలి

గోపాలపురం: గోపాలపురం-1 సచివాలయం వద్ద సర్పంచ్ పైడి శిరీష అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ ఈ సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన సమాచార బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలోని జండా దిమ్మ వద్ద వైఎస్సార్‌సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధి ఎస్‌కే వల్లీ, నాయకులు ముల్లంగి శ్రీనివాసరెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, ముద్దన మురళి, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి పాల్గొన్నారు.

రాజంపాలెం వాసుల సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే తలారి

మండలంలోని రాజంపాలెంలో గురువారం రాత్రి పల్లె నిద్ర చేసిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు శుక్రవారం ఉదయం గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న చిన్న చిన్న సమస్యలను అధికారులకు తెలియజేసి అక్కడికక్కడే పరిష్కరించారు.



నిడదవోలు మండలం కోరుపల్లిలో వైఎస్సార్ సీపీ పతాకావిష్కరణ



పెరవలి మండలం ఖండవల్లిలో ఇంటింటి ప్రచారంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్ తదితరులు



ఉండ్రాజవరం మండలం వేలివెన్నులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు భాస్కరరామయ్య



దేవరపల్లి మండలం దుద్దుకూరులో డిస్ ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ దుర్గారావు

సందడిగా సమారాధన



వనసమారాధనలో క్యారమ్స్ ఆడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: గ్రామాల్లో వన సమారాధనల సందడి ప్రారంభమైయింది. కార్తిక మాసం సందర్భంగా కుల, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో వన సమారాధనలు నిర్వహిస్తున్నారు. మండల పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం దేవరపల్లి-యాదవోలు రోడ్డులోని ఫ్లై ఓవర్ వద్ద గల పామాయిల్ తోటలో వన సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు, మండలంలోని గ్రామ సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు, వ్యాపారస్తులు పెద్ద ఎత్తున పాల్గొని భోజనాలు చేశారు. ఆట,పాటలతో ఉత్సాహంగా గడిపారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ దుర్గారావు క్యారమ్స్ ఆడి సరదాగా గడిపారు. దేవరపల్లి క్లస్టర్ కార్యదర్శి ఎన్.రవికిషోర్ పర్యవేక్షణలో కార్యక్రమం నిర్వహించారు.

అసైన్డ్ భూముల సాగుదారులకు హక్కు పత్రాలు



హక్కు పట్టాలు పొందిన సాగుదారులతో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

గోపాలపురం: రైతుల సంక్షేమానికి కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని గంగోలు, గోపాలపురం, కోమటికుంట గ్రామాల్లోని 320 ఎకరాల ఎసైన్డ్ భూములపై వాటి సాగుదారులైన 225 మంది రైతులకు ప్రభుత్వం సంపూర్ణ హక్కు పత్రాలు జారీ చేసింది. స్థానిక ఏఎంసీ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకట్రావు వారికి హక్కు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షపాతిగా నిలిచిందన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌కే వల్లీ, కూసం రామమోహన్‌రెడ్డి, పఠాన్ అన్వర్‌బాషా, ఇళ్ల శ్రీరామమూర్తి, ముల్లంగి శ్రీనివాస రెడ్డి, తహసీల్దార్ బి. రవీంద్రనాథ్, ఎంపీడీఓ ఆర్. శ్రీదేవి లబ్ధిదారులు పాల్గొన్నారు.

స్త్రీ నిధి బకాయి చెల్లిస్తేనే బ్యాంక్ లింకేజీ రుణం



ఖండవల్లిలో డ్వాక్రా గ్రూపు సభ్యులను విచారిస్తున్న జిల్లా అధికారులు

పెరవలి: తీసుకున్న స్త్రీనిధి రుణం చెల్లించకుండా, కొత్త రుణం కావాలంటే ఎవరిస్తారని జిల్లా స్త్రీనిధి ఏజీఎం ఎం.ధర్మేంద్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు బ్యాంకు లింకేజీ రుణం రాకుండా అధికారులు అడ్డుపడుతున్నారంటూ ఖండవల్లికి చెందిన కిరణ్మయి డ్వాక్రా గ్రూపు సభ్యులు ఇటీవల స్పందనలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్త్రీ నిధి జిల్లా అధికారులు శుక్రవారం ఖండవల్లి వచ్చి విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఏజీఎం ఎం.ధర్మేంద్ర పై విధంగా వ్యాఖ్యానించారు. కిరణ్మయి గ్రూపునకు రెండు నెలల క్రితం బ్యాంక్ లింకేజీ రుణం రూ.20 లక్షలు మంజూరైంది. ఈవిషయం తెలిసిన స్త్రీనిధి అధికారులు ఆ గ్రూపునకు రుణం ఇవ్వొద్దని బ్యాంకు అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.ఈ గ్రూపు సభ్యులు స్త్రీనిధి రుణం తీర్చకుండా కేవలం బ్యాంక్ లింకేజీ రుణాన్ని మాత్రమే తీర్చారు. దాంతో వారికి కొత్తగా రూ.20 లక్షల బ్యాంక్ లింకేజీ రుణం మంజూరవగా, రుణం ఇవ్వకుండా అధికారులు అడ్డుపడ్డారు. ఈ విషయంపై విచారణకు వచ్చిన అధికారులు రుణం కావాలంటే పాత రుణం తీర్చాలని లేకపోతే రుణం ఇవ్వడం తేల్చి చెప్పారు. గ్రూప్ లీడర్ తనకు వచ్చే రూ.2 లక్షలతో పాటు పొదుపు మొత్తం నుంచి రూ.60 వేలు తీసుకోవాలని అధికారులను కోరారు. అందుకు కొంత సమయం ఇవ్వాలని కూడా అధికారులను ఆమె అభ్యర్థించారు. డిసెంబర్ 15 లోగా మొత్తం రూ.2.60 లక్షలు చెల్లించేందుకు అధికారులు అంగీకరించారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ రత్నకుమారి, డీపీఎం కె.త్రిమూర్తులు, ఏపీఎం నాగరాజు, సీసీలు రమేష్, దుర్గ పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోళ్లు

గోపాలపురం: నూతన వంగడాలు, ఎరువులు, సాగు విధానంపై రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించేందుకు మండలానికో వ్యవసాయ సలహా మండలిని ప్రభుత్వ ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. దానిని వినియోగించుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశాన్ని అధ్యక్షుడు జొజ్జవరపు అన్నవరం అధ్యక్షతన స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ ప్రస్తుతం రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కూసం రామమోహన్ రెడ్డి, నాయకులు ఎస్‌కె వల్లీ, ముల్లంగి శ్రీనివాస రెడ్డి, దాసరి కుటుంబరావు, ఏఒ బి. రాజారావు రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.